నిధుల దుర్వినియోగం!

- బీఎస్ మక్తా ప్రభుత్వ పాఠశాలలో రూ.10లక్షలు పక్కదారి పట్టించే యత్నం
- సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లీడర్ చేతివాటం ● హెచ్ఎం ప్రమేయం లేకుండానే తతంగం

ఖైరతాబాద్, మే 29: ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి నిధులు పక్క దారి పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు బస్తీల్లో ఉన్న సర్కారు బడుల బాగు కోసం కొంత నిధులను కేటాయించింది. అయితే కొన్ని గ్రూపులు ఆ నిధులను పక్కదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలు వినిస్తున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నా, స్వలాభం కోసం ఆ వసతుల పేరిట నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం. సోమాజిగూడ డివిజన్ లోని బీఎస్ మక్తా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 135 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్‌లో అంగన్‌వాడీ స్కూల్ నిర్వహిస్తుండగా, 30 మంది పిల్లలకు చదువుతో పాటు పోషకాహారాలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల బీఎస్ మక్తా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ప్రస్తుత గ్రూపునకు ప్రభుత్వం రూ.10.30లక్షల నిధులు కేటాయించింది. ఆ నిధులతో పాఠశాలలో మిగిలి ఉన్న మౌలిక వసతులు, పిల్లలకు యూనిఫాం, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉండగా, అవసరం లేని పనులు చేయిస్తూ సదరు గ్రూపు లీడరు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ప్రధానోపాధ్యాయుడితో ప్రమేయం లేకుండానే, సర్వశిక్ష అభియాన్‌కు చెందిన ఓ అధికారి చొరవతో నిధులను పక్కదారి పట్టిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఎల్లారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలోనూ సదరు గ్రూపు లీడరు తన చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నదన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

కొత్తవి తొలగించి.. మళ్లీ కొత్త ఫ్యాన్లు ఏర్పాటు..

గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులతో పాటు స్థానికులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి దాతల ఆర్థిక సాయంతో పాఠశాలలో ఆర్నెళ్ల క్రితం ఓ మంచి కంపెనీకి చెందిన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి ఎలాంటి రిపేర్లు లేకుండా పనిచేస్తుండగా, మళ్లీ వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఆయా పనులకు అక్షరాల రూ.1.93 లక్షలకు పైగా ఎస్టిమేషన్లు వేయడం, మెటీరియల్ తెప్పించడం చకా చకా జరిగిపోయాయి. ఇక ఫ్యాన్లు, వైరింగ్ మార్చడమే తరువాయి. ఈ పనుల్లోనూ భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. మెటీరియల్ కొనుగోలు చేసే బాధ్యత సదరు గ్రూపు లీడరు తీసుకోగా, ఆ మెటీరియల్ కూడా ఓ అధికారికి సంబంధించిన వారి వద్ద తెప్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనైజీ లైను సైతం గతేడాది ఏర్పాటు చేయగా, మళ్లీ కొత్తగా దానిని పునర్నిర్మిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.



బీఎస్ మక్తా ప్రభుత్వ పాఠశాలలో గతంలో బిగించిన ఫ్యాన్లు

హెచ్ఎం ప్రమేయం లేకుండానే..

ఒక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులు జరుగాలంటే ప్రధానోపాధ్యాయుడి ప్రమేయం తప్పనిసరిగా ఉంటుంది. కానీ బీఎస్ మక్తా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం చొరవ లేకుండా సదరు గ్రూపు లీడరు అన్ని తనై నడిపిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొత్త ఫ్యాన్లు ఉన్నాయి కదా మళ్లీ ఎందుకు కొత్తవి ఏర్పాటు చేస్తున్నారని సదరు ప్రధానోపాధ్యాయుడు నిలదీస్తే ఇది మీకు అనవసరం.. నాకు వారు తెలుసు.. వీరు తెలుసు అంటూ బెదిరింపులకు సైతం ప్లాపడుతున్నట్లు సమాచారం. కాగా కొత్త ఫ్యాన్లు, ఏర్పాటు, అభివృద్ధి పనులపై ఏఈ రాజేశ్‌ను వివరణ కోరగా, ఫ్యాన్లు కొత్తవే ఉంటే దానిని మినహిస్తామని వివరించారు.

సదుపాయాలు అంతంత మాత్రమే

బీఎస్ మక్తా ప్రభుత్వ పాఠశాలలో నీటి కనెక్షన్ లేకపోవడంతో తాగునీటి కోసం విద్యార్థులు వాటర్ బాటిళ్లపై ఆదారపడాల్సి వస్తోంది. ప్రధానోపాధ్యాయుడికి సైతం కనీసం విడిగా గది లేకపోవడంతో క్లాస్ రూమ్‌నే ఆఫీసు రూంగా వినియోగించుకుంటున్నారు. ఉన్న మోటారు చెడిపోవడంతో వాష్ రూమ్‌లకు నీటి సరఫరా నిలిచిపోయింది. విద్యార్థుల కోసం లైబ్రరీ కూడా లేదు. పాఠశాలకు కనీసం ఓ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసిన విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

బీఎస్ మక్తా ప్రభుత్వ పాఠశాల

బిగించేందుకు సిద్ధంగా ఉన్న ఫ్యాన్లు, సామగ్రి

బాలిక అదృశ్యం

బంజారాహిల్స్, మే 29: స్నేహితురాలి వద్దకు వెళ్తున్నానంటూ ఇంట్లోంచి వెళ్లిన 14ఏండ్ల బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నం.11లోని ఉదయ్‌నగర్‌లో వాసం ఉంటున్న బాలిక స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈనెల 17న సాయంత్రం తాను స్నేహితురాలితో మాట్లాడి వస్తానంటూ బయటకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోగా తాను స్నేహితురాలు సోనాలితో కలిసి ముంబై వెళ్తున్నానంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టింది. అప్పటినుంచి బాలిక ఆచూకీ కోసం కుటుంబసభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నారు. కాగా ఇటీవల 'తాను సైఫ్ అనే యువకుడిని పెళ్లిచేసుకున్నానంటూ .. 'ఇన్‌స్టాలో మెసేజ్ చేయడంతో పాటు కొన్ని ఫొటోలు పెట్టింది. దీంతో షాక్‌కు గురయిన బాలిక సైఫ్ అనే యువకుడి గురించి ఆరా తీయగా అతడు జహీరానగర్‌లోనే ఉంటాడని తేలింది. ఈ మేరకు బాలిక తల్లి బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 363 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫిర్యాదు చేశారన్న కక్షతో.. వెంబడించి దాడి

బంజారాహిల్స్, మే 29: భర్తతో పాటు అత్తామామల వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్ వచ్చిన యువతితోపాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లో ఉంటున్న దేవా సోత్ సోని(19) వివాహం 2023లో జాలోత్ ఆకాశ్‌తో జరిగింది. వీరికి పాప పుట్టింది. కొన్నాళ్ల తర్వాత నుంచి భర్తతో పాటు అత్తామామలు కె.విజయ, హనుమంత్ ఆమెను పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ఈనెల 26న తల్లిదండ్రులతో పాటు వచ్చిన సోని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేసిన అనంతరం కొన్నాళ్లపాటు పుట్టింట్లో ఉండాలని సోనికి సూచించారు. దీంతో ఆటోలో ఇంటికి బయలుదేరగా కొంత దూరం బైక్‌లమీద వెంబడించిన భర్త ఆకాశ్‌తో పాటు అతడి స్నేహితులు మోహన్, సాయికిరణ్ తదితరులు ఆటోను అడ్డుకుని దాడికి దిగారు. నడుస్తున్న ఆటోమీద రాళ్లు వేయడంతో సోని తండ్రికి గాయాలయ్యాయి. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురయిన బాధితులు నేరుగా గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు బుధవారం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు పంపించగా ఆకాశ్, హనుమంతు, విజయ, మోహన్, సాయికిరణ్ తదితరుల మీద ఐపీసీ 498ఏ, 341, 323, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మైనార్టీ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బద్రుద్దీన్

హిమాయత్‌నగర్, మే 29: ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మహ్మద్ హాజీ బద్రుద్దీన్ నియమితులైయ్యారు. బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగం చైర్మన్ ముజఫర్ అలీ, నాయకులు జావీద్, కమల, సాదు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ హాజీ బద్రుద్దీన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న విజయారెడ్డి

ముద్ర లోన్ పేరుతో మోసం

ఖైరతాబాద్, మే 29: ముద్ర లోన్ పేరుతో ఓ వ్యక్తిని నిండాముంచాడు. పంజాగుట్ట పోలీసుల వివరాల ప్రకారం... సోమాజిగూడకు చెందిన ఎం.కార్తీక్ సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నాడు. గతంలో ఇనార్బిట్ మాల్‌లో పనిచేస్తుండగా, బాషా అనే వ్యక్తి పరిచమయ్యాడు. ఏమైనా ఉద్యోగం ఉంటే చూడాలని కార్తీక్ ఫోన్ నంబరు తీసుకున్నాడు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ముద్ర లోన్ ఇప్పిస్తానని, అందుకు రూ.50వేలకు రూ.2,500, రూ.1.50లక్షల కోసం రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దీంతో అతని మాటలు నమ్మిన కార్తీక్ యూపీఐ ద్వారా రూ.1,500 చొప్పున రెండు సార్లు చెల్లించాడు. మరుసటి రోజు ప్రాసెస్ నడుస్తుందని, మరో రూ.2వేలు చెల్లించాలని కోరాడు. ఇలాంటి మొత్తం రూ.30వేలకు వరకు సమర్పించుకున్నాడు. అనంతరం సదరు బాషాకు ఫోన్ చేయగా స్పందించడం లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదుచేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుడిని పరామర్శించిన మేయర్

బండ్లగూడ, మే 29: పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య కార్మికుడు కుమ్మరి నరేందర్ బుధవారం విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో చేతి ఎముక విరిగింది. విషయం తెలుసుకున్న మేయర్ వార్డు కార్యాలయంలో అతనిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేశారు. పారిశుధ్య కార్మికులు తపని సరిగా రేడియం ఉన్న దుస్తులను ధరించాలని సూచించారు. రోడ్లపై పని చేసేటప్పుడు తగిన జగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు.

అనూహ్యారెడ్డికి సేవారత్న అవార్డు

హిమాయత్‌నగర్, మే 29: సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం 2014 విశిష్ట సేవలు అందిస్తున్న కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జి.అనుహ్యారెడ్డి సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. యూకే పార్లమెంట్ వారు ఈ అరుదైన పురస్కారాన్ని జూన్ 22న లండన్‌లోని పార్లమెంట్ వేదికగా హౌస్ ఆన్ లార్డ్స్‌లో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. ఫౌండేషన్ నుంచి విభిన్న రంగాల్లో తాము అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం ఇవ్వడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని అనూహ్యారెడ్డి తెలిపారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

- కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి
- ఏఆర్వో దశరథ్‌సింగ్ రాథోడ్
- అధికారులకు, సిబ్బందికి అవగాహన

జూబ్లీహిల్స్, మే 29: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సికింద్రాబాద్ రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, జూన్ 4న పటిష్ట బందోబస్తు మధ్య కౌంటింగ్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బుధవారం సాయంత్రం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని జూబ్లీహిల్స్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జూబీహిల్స్ ఏఆర్వో దశరథ్‌సింగ్ రాథోడ్, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, ఈఈ రాజ్‌కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్, మే 29: లోక్‌సభ ఎన్నికల్లో తుది ఘట్టానికి చేరుకున్నామని.. ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించడంలో అధికారులది కీలకపాత్ర అని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబీహిల్స్ ఏఆర్వో దశరథ్‌సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. కౌంటింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. బుధవారం షేక్‌పేట్ నారాయణమ్మ కళాశాలలో ఏఆర్వో సేవా ఇస్లావత్‌తో కలిసి కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి అవగాహన నిర్వహించారు. అంతేకాక ఇతరుల విధుల్లో జోక్యం చేసుకోరాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని జూబ్లీహిల్స్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఆర్వో దశరథ్‌సింగ్ రాథోడ్

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్‌తో భర్తీ చేయాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, మే 29: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్‌తో భర్తీ చేయాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిధిబృందం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు యాజమాన్య కోట కింద భర్తీ చేసే సీట్లకు విద్యార్థుల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లి దండ్రులపై విపరీతమైన ఒత్తిడి తీసుకువచ్చి అందినకాడికి వసూలు చేస్తున్నారని తెలిపారు. చైర్మన్ లింబాద్రి సానుకూలంగా స్పందించి ఫీజులపై విచారణ చేసి కాలేజీలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గ్యార నరేశ్, ఎండీ అన్వర్, హరీశ్, నరేశ్, శివ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సిద్ధిఖీ

హిమాయత్‌నగర్, మే 29: వక్ఫ్‌బోర్డ్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్ధిఖీ, ఆలిండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు జిల్లాలోని శ్మశానవాటికలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. వంద ఎకరాల వక్ఫ్‌భూమిని కేటాయించాలని కోరారు. అన్యాక్రాంతమైన వక్ఫ్‌భూములను భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇండ్లులేని పేద ముస్లింలకు 100గజాల స్థలాన్ని కేటాయించి ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డ్ ఆస్తులను పరిరక్షించి న్యాయపరమైన అధికారాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సనా ఉల్లాఖాన్, ఎస్‌కే రబ్బాని, ఎండీ దస్తగిరి, ఎండీ ఇలియాస్ పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీనివాసుడి కల్యాణం

మైలార్‌దేవ్‌పల్లి, మే 29: శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్‌కాలనీలోని వెంకన్నగుట్టపై కొలువుదీరిన దేవస్థానంలో సప్తమ వార్షిక ఉత్సవాల్లో భాగంగా పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తదనంతరం స్వామి వారి పల్లకీ సేవ, అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాలయ కమిటీ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ మూసివేయాలి

ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భద్ర, తదితరులు

హిమాయత్‌నగర్, మే 29: పర్యావరణానికి హాని కల్గించే విధంగా ఉన్న హుజూర్‌నగర్, మహంకాళిగూడెం గ్రామం శివారులో ఉన్న దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేయాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫారెస్ట్ అనుమతులు పాటించకుండా కంపెనీ యాజమాన్యం కంపెనీని నడుపుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం చేసే పసుపులేటి సురేశ్‌ను హత్య చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇక్కడ దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉండటం వల్ల పర్యావరణం కలుషితమైన ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఈ సంస్థ చేసే దోపిడీ, అక్రమాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్‌సాయి, నాయకులు రిజ్వాన్ అహ్మద్, ప్రశాంత్, రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు

జూబ్లీహిల్స్, మే 29: వర్షాకాలంలో మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లో కాకుండా హైదరాబాదాద్ మెట్రో వాటర్, సీవరేజీ బోర్డు అధికారులు డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. ప్రమాదరహితంగా పనులు చేపట్టేందుకు మనుషులు మ్యాన్‌హోల్స్‌లోకి దిగకుండా పూర్తి జాగ్రత్తలు పాటిస్తూ మిషనరీ సహాయంతో పూడికతీతకు బకెట్ క్లీనింగ్ పనులు చేపడుతున్నారు. బుధవారం జూబ్లీహిల్స్ సెక్షన్‌లో జరుగుతున్న బకెట్ క్లీనింగ్ పనులను మేనేజర్ శ్రీహరి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. యూసుఫ్‌గూడ పోలీస్ లైన్ నుంచి వెంకటగిరిలోని వాటర్ వర్క్స్ కార్యాలయం వరకు పూడికతీత పనులు చేపట్టారు. జలమండలి డివిజన్-6 జీఎం ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ సెక్షన్‌లో 300-450 ఎంఎం డయా ఆర్‌సీసీ సీవరేజీ పైప్‌లైన్‌లో పూడికతీత పనులు చేపట్టినట్లు మేనేజర్ శ్రీహరి తెలిపారు.

వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29: ఆదివాసీ విద్యార్థులకు సరైన వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాగబోయిన పాపారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ.. అడిక్‌మెట్‌లోని ఆదివాసీ బాలికల హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు, నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. నగరంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఆదివాసీ నిరుద్యోగ యువతకు వసతి, స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అడిక్‌మెట్ హాస్టల్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న 250 గజాల స్థలంలో నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.